రహదారులు.. డంపింగ్ యార్డులు

- డంపింగ్ యార్డుకు నోచుకోని చింతలపూడి
- చెత్తతో దుర్గంధం వెదజల్లుతున్న రోడ్లు
- స్థలం కేటాయించాలని కోరుతున్న ప్రజలు


డంపింగ్ యార్డును తలపిస్తున్న చింతలపూడి-టి.నరసాపురం రహదారి

చింతలపూడి: పట్టణంలో ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. పట్టణం నుంచి ప్రధాన రహదారులపై ప్రయాణించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. కారణం పట్టణంలోని చెత్త, చెదారం ఈ రోడ్లపై పోస్తుండటంతో రోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. చింతలపూడి నగర పంచాయతీకి సరైన డంపింగ్ యార్డు లేదు. దీంతో ప్రతి రోజూ వచ్చే టన్నుల కొద్దీ చెత్తను ఎక్కడ పోయాలో అధికారులకు అర్థం కావడం లేదు. దీంతో రోడ్లకు ఇరువైపులా ఎక్కడికక్కడ చెత్తను డంప్ చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం, ప్రతి రోజూ పట్టణంలో సేకరించిన చెత్తను బైపాస్ రోడ్డుపై కొంత, కాంతంపాలెం రోడ్డు పక్కన కొంత, టి నరసాపురం రోడ్డు పక్కన కొంత పోస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఐదెకరాల స్థలం కేటాయించాలి

దాదాపు పట్టణ జనాభాతో పాటు ప్రతి రోజూ వచ్చి పోయే ప్రయాణికులతో 50 వేలకు పైగా జనాభా చింతలపూడి పట్టణంలో మసులుతుంటారు. నగర పంచాయతీ స్థాయికి చేరుకున్న చింతలపూడి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డంపింగ్ యార్డుకు కనీసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఫైర్ స్టేషన్ సమీపంలోని ముడుసుల కుంట చెరువులోని 80 సెంట్ల స్థలంలో గతంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి, ఎరువుగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అప్పట్లో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పథకం ఏమైందో తెలియదు.

దుర్గంధంతో రహదారులు



చెత్తను రోడ్ల పక్కన పోస్తుండటంతో రోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ రహదారులపై ప్రయాణించాలంటే నరకయాతన తప్పడం లేదు. ముఖ్యంగా టి.నరసాపురం వెళ్లే రహదారి పక్కన విపరీతంగా చెత్త పేరుకు పోయింది. డంపింగ్ యార్డుకు స్థలాన్ని సేకరించి పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తే మంచిది. –కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్

డంపింగ్ యార్డు అవసరం



చింతలపూడి పంచాయతీకి డంపింగ్ యార్డు అవసరం ఎంతైనా ఉంది. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. వ్యాపార సంస్థలు, జనాభా పెరుగుతున్నారు. చెత్త కూడా అదే మోతాదులో పెరుగుతోంది. ప్రభుత్వ పోరంబోకు స్థలాలను గుర్తించి డంపింగ్ యార్డుకు కేటాయించాలి. డాక్టర్ బి.రాంబాబు నాయక్, ఎంపీపీ, చింతలపూడి

న్యాయం చేయాలని గిరిజనుల ధర్నా


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం: 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములకు ఐటీడీఏ కేఆర్‌పురం ఎస్‌డీసీ అన్యాయంగా మరొకరికి తప్పుడు ఆర్డర్లు ఇచ్చారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. జెగ్గిశెట్టిగూడేనికి చెందిన గిరిజనులు కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జెగ్గిశెట్టిగూడెం గ్రామానికి చెందిన ఉనుముల సూర్యచంద్రం వారసులకు చెందిన 36 ఎకరాల భూమి గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్ఎస్ఆర్‌లో కూడా వీరి పేర్లే నమోదయ్యాయన్నారు. అయితే ఇటీవల ఈ భూమికి సంబంధించి ఎస్‌డీసీ వేరే వారికి అక్రమంగా ఆర్డర్ ఇచ్చారని ఆరోపించారు. దీని వలన గిరిజనులకు అన్యాయం జరిగిందని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని నీరుగారుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు బాధిత గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

వన్ ధన్ కేంద్రాలను పరిశీలించిన ఐటీడీఏ పీఓ


వన్ ధన్ కేంద్రంలో చింతపండు యూనిట్‌ను పరిశీలిస్తున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: వన్ ధన్ కేంద్రాల్లో తయారు చేసిన ఉత్పత్తులను జోడించి తద్వారా ఆదాయం మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం, జిల్లెళ్లగూడెంలో ఏర్పాటు చేసిన వన్ ధన్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చింతపండు ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి అక్కడ మహిళలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం జీపీఎస్ పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను, పాఠ్యాంశ బోధనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుట్టాయగూడెం సంత మార్కెట్ వద్ద జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన కారం శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ కారం మిల్ ప్రాసెసింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. అలాగే పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారం శుద్ధి కేంద్రం ప్రాంగణ స్థలం జీసీసీకే చెందుతుందని చెప్పారు. అయితే ఈ స్థలానికి సంబంధించి తన దృష్టికి వచ్చిందని ఈ స్థలం జీసీసీకే చెందే విధంగా సంబంధిత సర్పంచ్‌తో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ రాజబాబు, జీలుగుమిల్లి వెలుగు ఏపీఎం ఎస్.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్థిక సాయం


కొవ్వలి సావిత్రికి ఆర్థిక సాయం అందిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు

కొయ్యలగూడెం: పేద బ్రాహ్మణులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలని అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబా, కార్యదర్శి మోరపాకల రాధాకృష్ణ శుక్రవారం కోరారు. కొయ్యలగూనికి చెందిన పేద బ్రాహ్మణురాలు కొవ్వలి సావిత్రికి వారు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. సావిత్రి సుమారు ఐదు సంవత్సరాల నుంచి తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో సింగపూర్‌కు చెందిన చేయూత సంస్థకు సిఫార్సు చేయగా సావిత్రి పేరున సోము ఫిక్స్ డిపాజిట్ చేశారన్నారు. డిపాజిట్ పత్రాలను బ్రాహ్మణ సంక్షేమ సంఘం పరిషత్, బ్రాహ్మణ యువశక్తి సంఘం ద్వారా అందించారు. బ్రాహ్మణ యువశక్తి అధ్యక్షుడు గోదావరి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి బొల్లాప్రగడ ప్రసాద్, ఉపాధ్యక్షుడు మామిళ్లపల్లి దుర్గాసీతారాం, కోశాధికారి ఆచంట రవి, గౌరవాధ్యక్షుల్లు చెట్లపల్లి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 6వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా జంగారెడ్డిగూడెం డిపో నుంచి భద్రాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయన్నారు. సీతా రాముల కల్యాణం అనంతరం భద్రాచలం నుంచి తిరిగి రావడానికి ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

ద్వారకాతిరుమల: వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఈ బిల్లుకు మద్దతిచ్చి ఇప్పుడు ముస్లిం సమాజానికి తప్పుడు సమాచారం ఇస్తున్నారని మండిపడ్డారు. వక్ఫ్ బిల్లును టీడీపీ మైనారిటీ నాయకులు, ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు బీజేపీతో జతకట్టడాన్ని నిరసిస్తూ 1997లో బషీరుద్దీన్ బాబూఖాన్ తన పదవికి అప్పట్లోనే రాజీనామా చేశారనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

లింగపాలెం: వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మండల పరిషత్ సమావేశానికి వెంకటలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మట్టా సురేష్ మాట్లాడుతూ పలు శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు తెలపకుండా కొంతమంది నాయకులకు మాత్రమే చెప్పడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. మండల పరిషత్ నిధులు గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించినప్పటికీ పలు పంచాయతీల్లో తీర్మానాలు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. ఎంపీడీవో కె.వాణి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు, నాయకులకు పార్టీలకతీతంగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ–2 కె.ఝాన్సీ, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు, అధికారులు

వేలేరుపాడు: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై వేలేరుపాడు మండలం చిగురుమామిడి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర విపత్తు నివారణ దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) సభ్యులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎంవీ రమణ మాట్లాడుతూ తుఫాన్లు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తు నివారణ దళం సిబ్బందితో ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిగించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, కుక్కునూరు ఎస్సై ఎం.రమేష్‌బాబు, వేలేరుపాడు ఎస్సై, పోలీసు సిబ్బంది, వేలేరుపాడు తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాము కలకలం


పామును పట్టుకున్న చదలవాడ క్రాంతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని పేరంపేట గ్రామంలో కలపాల నాగరాజు ఇంట్లోకి ప్రవేశించిన గోధుమ తాచు పాము కలకలం రేపింది. దీంతో స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతికి సమాచారం అందించారు. అతడు పామును పట్టుకొని స్థానిక అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు.

నూకాలమ్మకు రజత జడ సమర్పణ


నూకాలమ్మ అమ్మవారికి రజత జడను అందజేస్తున్న దాత చెరుకూరి మోహనరావు దంపతులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ పర్యవేక్షణలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ఏకాదశ హారతి, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహామంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. అమ్మవారిని మున్సిపల్ కమిషనర్ కొమ్మినేని వెంకట రమణ, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి తదితర పట్టణ ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారికి చెరుకూరి అనంత పద్మ, మోహనరావు దంపతులు (మలకపల్లి) రూ.70 వేల విలువ గల వెండి జడను సమర్పించినట్లు తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

డ్వాక్రా సంఘాలకు ఆర్థిక సహకారం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జేమ్స్

పోలవరం రూరల్: డ్వాక్రా సంఘాల సభ్యులకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో పలు రకాల జీవనోపాధి మార్గాలు పెంపొందించేందుకు సహకార సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని ఏపీఎం జేమ్స్ తెలిపారు. పోలవరం మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో క్రెడిట్ అండ్ లైవ్‌హుడ్ యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం ద్వారా రూపొందించామన్నారు. దీని కోసం 6 నుంచి 8 సంఘాల వరకు ఒక ఎన్యుమరేటర్‌ను గుర్తించామన్నారు. వీరు ప్రతి సభ్యురాలి అవసరాలను గుర్తించి, వారికి పలు రకాల జీవనోపాధి డేటాను రూపొందించాల్సి ఉంటుందన్నారు. మండలం మొత్తం 155 మంది ఎన్యుమరేటర్లను గుర్తించి వారికి గత నాలుగు రోజులుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీలు నిర్మల కుమారి, రమాదేవి, గ్రామ సంఘాల వీవోఏలు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

లింగపాలెం: ధర్మాజీగూడెంలోని శ్రీవిద్య హైస్కూల్‌లో శుక్రవారం 19వ వార్షికోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి కె.రామారావు, సర్ సీఆర్ఆర్ కాలేజ్ లెక్చరర్ కొఠారి సూర్యచంద్ర శేఖరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు నృత్యాలు, నాటికలతో అలరించారు. ఆటపాటలు, చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రత్నాకర్‌రావు, కరస్పాండెంట్ సీఎస్ సాయి సునంద, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజన పల్లెల్లో సారా నిర్మూలనకు చర్యలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత

బుట్టాయగూడెం: గిరిజన పల్లెలను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ప్రజలు తమ వంతు సహకారాన్ని అధికారులకు అందించాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన మొద్దప్పగూడెంలో గురువారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మొద్దప్పగూడెం, కొవ్వాడ, రాజానగరం, రెడ్డిగూడెం, లక్ష్మీపురం గ్రామాల ప్రజలతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సభలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శ్రీలత మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా ఏపీ ప్రొహిబిషన్ చట్టం 1995 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ పీఓ రాములు నాయక్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పూర్తి స్థాయిలో నాటు సారాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్, డీపీఈఓ ఎ.ఆవులయ్య, ఏఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మంట్ అజయ్ కుమార్ సింగ్, జి.పాండు రంగారావు, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఎక్సైజ్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

పంచాయతీ అభినందన సభ ఏర్పాటు


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న పాలకవర్గం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పాలకవర్గ అభినందన, సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాలకవర్గం ఏర్పడి నాలుగు సంవత్సరాలైన సందర్భంగా సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను విశ్లేషించారు. పంచాయతీ కార్మికులను సన్మానించి, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.రామచంద్రరావు, ఎంపీటీసీలు కె.చింతయ్య, వార్డు సభ్యులు వి.నాగరాజు, కె.కనకదుర్గ, కె.నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ ఎన్.సూరిబాబు, కె.నాగేశ్వరరావు, బి.బాబురావు, కె.రామకృష్ణ, కె.అచ్యుత్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో సిలువ మార్గం

కొయ్యలగూడెం: గుడ్ ఫ్రైడే పవిత్ర దినాలను పురస్కరించుకొని శుక్రవారం కన్నాయిగూడెం గ్రామంలో క్రీస్తు విశ్వాసులు సిలువ మార్గం నిర్వహించారు. అదే విధంగా కన్నాయిగూడెం గ్రామంలో ఆర్‌సీఎం చర్చ్ ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు అరుణ్, ఆక్సిలియం సిస్టర్స్, అనిల్ బాబు, కిరణ్ సాగర్, సింగ్ మాథ్యూ, జేసుదాస్, కండెల్లి శివ, రాజు కిషోర్, కళ్యాణ్, మధు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏరియా ఆసుపత్రిలో క్వాలిటీ అసెస్‌మెంట్


ఆసుపత్రిలో క్వాలిటీ అసెస్‌మెంట్ నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం క్వాలిటీ అసెస్‌మెంట్ నిర్వహించారు. స్టేట్ ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంత్, క్వాలిటీ అధికారి ఎస్.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో అసెస్‌మెంట్ నిర్వహించారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి రిపోర్టులను ఉన్నతాధికారులకు నివేదించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కాయకల్ప సర్టిఫికేట్ నిమిత్తం ఏరియా ఆసుపత్రి పేరును ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ బేబీ కమల, సీఎస్ఆర్ఎంవో రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సహస్ర శివ దీపార్చన నిర్వహణ


సహస్ర దీపాలంకరణతో వెలుగుతున్న జ్యోతిర్లింగం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర పాశుపత సహిత భువనేశ్వరి యాగం ముగింపు పురస్కరించుకొని రాత్రి మహిళలు సామూహికంగా దీపాలను వెలిగించి సహస్ర దీపాలతో జ్యోతిర్లింగాన్ని వెలిగించారు. యాగం నిర్విఘ్నంగా కొనసాగించిన బ్రహ్మశ్రీ మేడూరి రవితేజ శర్మ, ఆయన శిష్య బృందాన్ని పాలకవర్గ సభ్యులు భక్తులు ఘనంగా సత్కరించారు.

లక్ష గాజుల అలంకరణలో కుంకుళ్లమ్మ


గాజుల అలంకరణలో కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 30న ఉగాది పండుగ రోజు ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 7తో ముగియనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని నిత్యం ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారిని ఐదు లక్షల గాజులతో అలంకరించారు. నిత్యం అర్చకులు, పండితులు అమ్మవారికి కుంకుమ పూజలు, చండీ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం విద్యుద్దీపాలంకరణతో కళకళలాడుతుంది.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ డి.పావని

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ డి.పావని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవత సేవలు సమాజానికి చాలా అవసరమన్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, జిల్లా సంయుక్త కార్యదర్శి పుల్లూరి సోమశేఖర్, కోశాధికారి జల్లిపల్లి విశ్వేశ్వరరావు, సభ్యులు పి.కిషోర్, తాటి అప్పారావు, తూము విజయ్‌కుమార్, కొత్తపూడి శేషగిరిరావు, కిమిడి సురేంద్ర, నారం రాజా పాల్గొన్నారు.

కన్నాపురం వాసికి నంది పురస్కారం

కొయ్యలగూడెం: విద్యా, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో చేసిన కృషికి రాష్ట్ర ప్రభుత్వం నంది పురస్కారం లభించిందని కన్నాపురం గ్రామానికి చెందిన డాక్టర్ టి.పార్థసారథి శుక్రవారం పేర్కొన్నారు. విశ్వావసు ఉగాది ఉత్సవాల సందర్భంగా రాజమండ్రిలో ఏర్పాటు చేసిన జాతీయ పురస్కారోత్సవంలో తనకు పురస్కారం లభించిందన్నారు. పార్థసారథి కోట రామచంద్రపురం ఐటీడీఏ ఎంఈఓగా (రిటైర్డ్) విధులు నిర్వహించారు.

పట్టిసం ఫెర్రీ వేలం

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రం ఫెర్రీ వేలం శుక్రవారం నిర్వహించారు. రేవులో బహిరంగ వేలం ద్వారా పాట నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి యు.రాజారావు తెలిపారు.టీ వేలంలో రూ.11,85,000 వేలందారుడు దక్కించుకున్నారన్నారు. భక్తులను లైసెన్సు లాంచీతో నది దాటించేందుకు ఈ వేలం నిర్వహించామన్నారు.

రీ సర్వే గ్రామసభ


భూముల విస్తీర్ణం పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని ఎ.పోలవరం గ్రామంలో శుక్రవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రీసర్వే అనంతరం గ్రౌండ్ వాలిడేషన్ కింద రైతులకు భూముల విస్తీర్ణాలను అధికారులు చదివి వినిపించారు. అనంతరం రైతుల నుంచి విస్తీర్ణం వ్యత్యాసాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఎ.పోలవరం గ్రామాన్ని రీ సర్వే పైలెట్ విలేజ్ గా ఎంపిక చేసి, గత ఏడాది డిసెంబర్ 20న రీసర్వే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఈ సర్వేలో గ్రామ సరిహద్దు, ప్రభుత్వ భూములు సర్వే పూర్తి చేశామన్నారు. జనవరి 28వ తేదీన గ్రౌండ్ ట్రూతింగ్ గ్రామసభ నిర్వహించి, ప్రైవేట్ భూములు అన్నీ సర్వే పూర్తి చేసి విస్తీర్ణం లెక్కించామన్నారు.

ముత్యాలమ్మకు పంచామృత అభిషేకాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులు ఆధ్వర్యంలో అర్చకులు బ్రహ్మశ్రీ కె.సీతారాం నేతృత్వంలో ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని కొర్లపర బ్రహ్మయ్య, సత్య దంపతులు, భాస్కర్ ట్రావెల్స్ బాస్కరరావు దంపతులు, మద్ది వెంకటేశ్వరరావు దంపతులు, కె.రాజు, సుజాత దంపతులు దర్శించుకున్నారు.